## అనంత చలనం

మేఘం ఆకాశాన చలించనిదే
వర్షం భూమిపై చినుకులై కురవదు
చినుకు చినుకు పెనగనిదే/ వాన వాగై ప్రవహించదు
మట్టిని నాగలి ముద్దు పెట్టుకోనిదే
పంట పచ్చగా ఫలించదు
విత్తు పుడమి పొత్తిళ్ళలో చలించి
మొక్క ఆ కొమ్మలతో తరించి
ఆకుల మధ్య పువ్వు జనించి
రేకులు తలంబ్రాలై కాయన ప్రసవించనిదే
పండు మన పెదాల మధ్యనుంచి ఆకలి అంచులకు
పయనించదు / దారిని జయించడమంటే
కాళ్లను చలింపజేయడమే.., / నాగరికత మొత్తం
మనసు కదలికే.., చేతుల చలనమే
శ్వాసచలనం తోనే గాలిని వొడిసి పట్టుకుంటోంది
ఊపిరి / పెదాల చలనమే పదాల కదనం
పదాల కదనమే జీవన వేదాల మథనం
భావ చలన హృదయ స్పందన భాషలో విలీనం కవిత
చలనమే సృష్టి రహస్యాన్ని తెలిపే చరిత
చలనమే జీవన పరిపూర్ణత / నేల చలనమే
చలనమే గాలి / చలనమే లోక మనుగడకు సంపూర్ణత
మనిషి అణువణువు చలన భరితమే భవిత
లోకంలో నిరంతరం కుండపోతగా
ప్రాణవాయువు కురుస్తూనే వుంటుంది
ఏ క్షణమూ తన చలనమాగదు / నిలిచిపోతే...!!!
తనువు గడ్డకట్టే అశ్రువు
సింధువు కాలేని ఏకాకి బిందువు
ప్రభాతంలో చలనం లేనిదే
వెలుగు మనపై రంగుల కొంగు పరచదు
చంద్రునిపై సూర్యకాంతి ప్రసరనిదే
వెన్నెల మనపై కురవదు..,
కనురెప్పల మధ్య చూపుల చలనం
సీతాకోక చిలుకై ఎగురుతూ
శూన్యంలో రంగుల ఇంద్రధనుసుల్ని పొదగదు
ప్రతి దృశ్యాన్ని తల్లి పాలంత ప్రీతిగా
నిరంతరం పిండుకుని తాగుతూనే వుంటాయి నా కళ్ళు
ప్రతి సంఘటనని కరుణతో కరిగించి చూపించే
ప్రతిబింబాలు నా కళ్ళు / మనిషీ...!!!
చలించు చలించు నింగి నేల నీవై ప్రజ్వలించు
మౌనమై మనసుతో జ్వలించు
సర్వేజనా సుఖినోభవంతు జపించుతూ జనించు
విజయ పతాకమై పయనించు
విశ్వగీతికను నక్షత్రాల అక్షరాలతో లిఖించు..., చలించు
చలించకపోతే నిలిచిపోతావు
నిలిచిపోతే లోకాన బతుకు లేదు
చలనం లేకపోతే జీవితం సాగదు
భూమి తన చుట్టూ తాను తిరుగుతూ
గ్రహాలను గమనిస్తూ / శూన్యంలో జీవిస్తూ
మనిషి తెలుసుకోవలసిన సత్యాన్ని
నిశ్శబ్ధంగా నినదిస్తూ
సృష్టి ఆదినుంచే చెబుతోంది
కానీ...,
తనలోకి తాను చూసుకోలేక
తనని తాను తెలుసుకోలేక
తన చుట్టూ తాను తిరగలేక పోతున్నాడు
ప్రపంచాన్నంతా చుట్టే మనిషి..

-వై. శ్రీరాములు

# మాదీ స్వతంత్ర దేశం..

-డా॥ జె. భాగ్యలక్ష్మి

"... మాదీ స్వతంత్ర జాతి, భరతదేశమే మా దేశం, భారతీయులం మా ప్రజలం..." పాత పాట. సుమధురంగా వినిపిస్తోంది. టంగుటూరి సూర్యకుమారి మరణ వార్త వినగానే చెవుల్లో గింగురుమన్నవి ఆమె పాడిన పాటలే. స్వతంత్రం వచ్చాక కనీసం పది పదిహేనేళ్ళయినా ఈ పాటలు అన్ని వేదికలలో వినిపించేవి. ఇప్పటికీ అనిపిస్తూ ఉంటుంది ఆ రోజుల్లో విద్యార్థులుగా ఉండటమే గొప్ప వరమని.

అన్ని స్కూళ్ళలో చక్కటి దేశభక్తి పాటలు నేర్పేవారు. పిల్లలందరూ లేత గొంతులతో కలిసి పాడుతుంటే పాడేవాళ్ళకు, వినేవాళ్ళకు వొళ్ళు పులకరించేది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా..."

సూర్యకుమారి గొంతులో ఆ పాట ఆర్తిగా పలుకుతోంది. ఎవరినో బతిమాలి, బామాలి ఆంధ్రప్రదేశ్ నుండి ఈ క్యాసెట్టు తెప్పించాను, సూర్యకుమారి మీద ఉన్న ప్రేమకొద్దీ... నా బాల్యం మళ్ళీ జీవించాలనే ఆశకొద్దీ.

"...జాతులు మతములన్నీ
అన్నదమ్ముల వలె మెలగవలెనోయ్..."

ఎన్ని దేశభక్తి పాటలు! ఆ రోజుల్లో దేశభక్తి పాటలు వ్రాయని కవులు, దేశభక్తిని మనసారా నమ్మని ప్రజలు అరుదనే అనుకోవాలి. స్కూళ్ళలో ప్రార్థనా సమావేశాల్లో విధిగా దేశభక్తి పాట ఒకటి ఉండేది. "కులాలు లేవు. మతాలు లేవు. మనమందరం భారతీయులం. మనం అన్నదమ్ములం." ఇంచుమించు అరవైల వరకు ఇదే ధోరణి. అప్పుడు పెరిగిన ఆ తరం, విద్య నేర్చుకొన్న ఆ తరం... వందేమాతరం విన్నా, జనగణమన విన్నా ఆ క్షణమే శాశ్వతమన్నంతగా దానిలో లీనమయ్యేది. అప్పుడు చర్చనీయాంశాలు మాత్రం భిన్నంగా ఉండేవా? స్కూళ్ళ డిబేట్లలోనేమి, వక్తృత్వపు పోటీలలోనేమి, పరీక్షా పత్రాలలోనేమి "దేశ సమైక్యత", "భావ సమైక్యత", "దేశ ప్రగతి", "స్వావలంబన" వగైరా వగైరా ఉండేవి. పాటల విషయానికి వస్తే-

*"... ఎన్ని గొంతులు విన్నా*
*ఎన్ని గళములు ఉన్నా*
*గొంతెత్తి నీ పాట కలిసి పాడేసరికి*
*గళమెత్తి నీ పాట మరల పాడేసరికి*
*ఒక గొంతే, ఒక పాటే, ఒక్కటే ఈనాడు"*

ఏమిటా సమ్మోహనాస్త్రం! ఎందుకా ఆనందాశ్రువులు!

అదో పిచ్చి ప్రపంచం. అదో పిచ్చి ఆదర్శం. అంతా మంచే జరుగుతుందన్న ఊహ. ఎవరికీ అన్యాయం జరగదనే ఆశ. "సమ సమాజం", "సంక్షేమ రాజ్యం" ఇవి మేధావుల పలుకులు. ఎక్కడో అపశ్రుతి.. అప్పుడే "బజ్" మంటూ బెల్ మ్రోగింది.

తలుపు తీశాను. ఎదురుగా కొంచెం పొట్టిగా, బొద్దుగా కళ్ళజోడుతో ఒక వ్యక్తి దర్శనమిచ్చాడు. నోరంతా తెరచి నవ్వాడు. పళ్ళు తెల్లగా మెరిశాయి.

"నమస్కారం"

"నమస్కారం"

"మీరు నన్ను గుర్తుపట్టలేదు సార్"

నేను బదులుగా చిరునవ్వు నవ్వాను. నిజంగానే గుర్తుపట్టలేదు మరి.

"లోపలికి రండి" అన్నాను తలుపు బాగా తెరచి.

"అదేమిటి సార్ నన్ను 'మీరు' అని మన్నిస్తారు" అన్నాడతను.

"కూర్చోండి" అన్నాను.

"బలేవారే సార్. మీరు కూర్చోకుండా నేను కూర్చోవటమే."

"అటువంటివేమీ పెట్టుకోకండి. కూర్చోండి"

"నాకు తెలుసు సార్ మీరు నన్ను గుర్తుపట్టలేదు. అందుకే "మీరు" "మీరు" అని పిలుస్తున్నారు. ఇన్నాళ్ళకు ఈ ఊరికి వచ్చే అవకాశం వచ్చింది. ఈ ఊరి పేరు వింటేనే నాకు మొదట జ్ఞాపకమొచ్చేది మీరే. అందుకే వెతుక్కొంటూ వచ్చాను." అతని కళ్ళలో ఒకవిధమైన ఆరాధన. పెదవులపై నవ్వు.

"మస్తాన్... మస్తాన్ రెడ్డీ!"

"అవును సార్. మీకు జ్ఞాపకమున్నానా?"

"ఊఁ జ్ఞాపకమెందుకు లేవు? ఈ విశాల ప్రపంచంలో నాకున్న శిష్యులు మీ క్లాసుమేట్సే కదా! ఆ ఒక్క సంవత్సరమే నేను టెంపరరీ లెక్చరరుగా పనిచేసింది" అన్నాను ఆనందాన్ని జ్ఞాపకాలను అదుపులో పెట్టుకొంటూ.

"ఇరవై ఏడేళ్ళ నాటి మాట సార్. మీరు సెంట్రల్ గవర్నమెంటుకు వచ్చేశారు. తర్వాత మీతో మాటా పలుకూ లేదు. దూరాభారం కదా. మా ఊరికి మళ్ళీ ఎప్పుడయినా వచ్చారా సార్.

"రెండు మూడుసార్లు వచ్చి ఉంటాను. అదీ ఏదో పనిమీద. సెంట్రల్ గవర్నమెంటు నడుపుతున్న కొన్ని ప్రాజెక్టులున్నాయి కదా. అవి చూడటానికని..."

మంచినీళ్ళు, ఆరెంజి జ్యూస్, బిస్కెట్లు ట్రేలో పట్టుకొచ్చి అతనికి దగ్గరగా పెట్టాను.

"ఇంట్లో ఎవరూ లేరా సార్" అన్నాడతను చుట్టూ కలయజూస్తూ.

"లేరు. అందరూ వాళ్ళ వాళ్ళ పనుల మీద వెళ్ళారు. ఏ మధ్యాహ్నమో, సాయంత్రమో చేరుకొంటారు."

"ఆదివారం కూడా పనులేనా?" అంటూ అతను ఆశ్చర్యపోయాడు.

"పనులకు ఆదివారాలు, సోమవారాలుంటాయేమిటి? పనిచేసేవాళ్ళకు ఏ రోజయినా ఒకటే."

"నిజమేలేండి. మీ సంగతి మొదటి నుంచీ తెలిసిందే కదా. మీ ఫ్యామిలీ.." కొంచెం సంకోచించాడు. నాకు నవ్వు వచ్చింది.

"మా ఆవిడ మేరీ. తనది బీహారు..."

"అంటే...."

"అవును క్రిష్టియను. ఆదివాసీ క్రిష్టియన్.

నాలాగే సెంట్రల్ సర్వీసెస్‌లో ఉంది. ముస్సోరిలో ట్రైనింగులో ఉండగా పరిచయం. ఆ తర్వాత పెళ్ళి. పిల్లలు వినీత, కల్యాణ్. వినీత బిజినెస్ అడ్మినిస్ట్రేషన్

చేస్తోంది. కల్యాణ్ ఇప్పుడిప్పుడే కాలేజీలో చేరాడు."

"బాగుందిసార్. చాలాబాగుంది. ఆరోజుల్లో మీరంటే మా అందరికీ చాలా అభిమానము, ఆరాధన. మద్రాసు యూనివర్సిటీలో ఇంగ్లీషు లిటరేచర్‌లో ఫస్ట్ క్లాసులో పాసయ్యారని, పోటీ పరీక్షలకు చదువుతున్నారని అదో అద్భుతంగా చెప్పుకొనేవాళ్ళం. అప్పుడు పోటీ పరీక్షలని కూడా తెలీదు. మా భాషలో అది "ఐ.ఏ.యస్" పరీక్ష. మీరున్నది ఒక సంవత్సరమే అయినా మీరు మా మంచి మాష్టారు. మా అందరికీ బాగా జ్ఞాపకమున్నారు సార్."

"థ్యాంక్స్ ఇదంతా మీ అభిమానమే. మీతో కలిసి తిరిగిన రోజులు నేనూ మరచిపోలేను. స్పోర్ట్సు, నాటకాలు, డిబేట్లు, పిక్‌నిక్‌లు, టూర్లు, సిటిజన్ షిప్ క్యాంపులు... అదో ఆనందం. ఇంకేమిటి మస్తాన్. నీ కుటుంబ విషయాలు చెప్పు."

"నా కుటుంబం బాగానే ఉంది సార్. లలిత టీచరుగా పనిచేస్తోంది. పిల్లలు సుజాత, సుశీల. ఇద్దరూ స్కూల్లో చదువుతున్నారు."

"నువ్వేం చేస్తున్నావు?"

"రాజకీయాలు" అన్నాడు మస్తాన్‌రెడ్డి నవ్వుతూ.

అతనెప్పుడూ నవ్వుతూనే ఉంటాడు.

"నిజంగానా?" అన్నాను నమ్మలేనట్లు.

"నిజమే సార్. నేను పార్టీ వర్కరును. మా ఊరి లెవల్లో పార్టీలో నా పేరే చెప్పుకొంటారు. సమావేశాలు, సమ్మెలు, సత్కారాలు అన్నీ ఏర్పాటు చేస్తుంటాను. ఇక ఎన్నికల సమయమయితే చెప్పనక్కర్లేదు. ఊర్లో మనకు మంచి పలుకుబడి ఉంది సార్. ఒకసారి మన ఊరికి రండి. ఎటువంటి సభ ఏర్పాటు చేస్తానో చూద్దురుగాని."

నేనేం మాట్లాడలేదు. "మ్రోయింపు జయభేరీ, వాయింపుము నగారా..." అని సూర్యకుమారి పాట లోపలి గదిలో నుండి సన్నగా వినిపిస్తోంది.

"ఏవో చాలా పాతకాలం పాటలు పెట్టుకొన్నారేం సార్" అన్నాడతను నవ్వుతూ.

ఇంతలో లైటు పోయింది. పాట ఠక్కున ఆగి పోయింది.

"మీకూ ఉందా ఈ లైటు పోవటాలు" అన్నాడు.

"మాకూ అంటే... మేమైనా ప్రత్యేకమైన వాళ్ళమా? నీళ్ళ కొరత, విద్యుచ్ఛక్తి కొరత దేశమంతటా ఉన్నట్టే ఇక్కడే ఉంటుంది" అన్నాను.

"ఈ ఫాన్ మాత్రం తిరుగుతోందేం సార్."

"అది ఇన్వర్టరులే" అన్నాను.

"అవును లెండి. ఇప్పుడందరూ ఇన్వర్టర్లు పెట్టుకొం టున్నారు."

ఈ మాటా ఆ మాటా మాట్లాడుకొన్నాం. మాస్తాన్‌రెడ్డి మాటలు, వాదోప వాదాలు, ఆ వాక్చాతుర్యం నన్ను అబ్బురపరుస్తున్నాయి. ఎంత ఎదిగిపోయాడు! నేనెన్నడూ కలలో కూడా ఊహించని విషయాలు మాట్లాడుతున్నాడు.

వాళ్ళ ఊర్లో, చుట్టుపక్కల పల్లెల్లో ఏ కులాల వారికి ఎన్ని ఓట్లున్నదీ చెపుతున్నాడు. ఒకప్పుడు కులాల గురించి అడగటం, వాటి గురించి ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా మాట్లాడటం సభ్యత కాదనుకొనేవాళ్ళం. మంగలి వీధి, కుమ్మర వీధి, కమ్మర వీధి, బ్రాహ్మణ వీధి, కోమటి వీధి అనే పేర్ల స్థానే దేశ నాయకుల, కవుల, ప్రముఖుల పేర్లొచ్చాయి. ఇప్పుడేమో మా మస్తాన్ బీసీలు, ఓసీలు అంటూ అందరి కులం పేరుపేరునా చెపుతున్నాడు. ఏ ఆఫీసులో ఏ కులాలవాళ్ళు ఎంతమంది ఉన్నారు, ఎవరు ఎవరికి అన్యాయం జరిగిందనుకొంటున్నారు (కులమే ఒక అర్హత అయినట్లు మరింకే క్వాలిఫికేషన్లు అవసరం కానట్టు) ఏ ఏ కులాలకు ఏ ఏ సంఘాలున్నాయి, వారి డిమాండ్లు ఏమిటి అన్నీ ఏకరువు పెట్టున్నాడు.

అతని ధోరణి అడ్డుకొంటూ "కాలేజీ ఎలా ఉంది? బాగా మారిందా? బాగా పెరిగిందా? చాలా డిపార్టు మెంటులొచ్చాయా?" అని అడిగాను.

"అబ్బా చాలా పెరిగిపోయింది సార్. ప్రొద్దున, సాయంత్రం రెండు బ్యాచీల్లో ఉన్నారు స్టూడెంట్లు."

"లెక్చరర్లు?"

"వాళ్ళూ అంతే. కానీ కాలేజీలో చదువు బాగా చెప్పరు సార్."

"అదేమిటి?"

"అంతే సార్. కాలేజి లెక్చరర్లందరూ కలిసి ఒక ప్రైవేటు స్టడీ సెంటర్ లాంటిది పెట్టారు. అక్కడే శ్రద్ధగా చెపుతారు. నోట్సులిస్తారు. అక్కడ ఫీజులెక్కువే. అయినా చాలామంది, అక్కడికే వెళ్తారు. తప్పక పాసవుతారు గనుక. ఈ రాజకీయం నాకు అర్థం కాలేదు.

"కానీ అక్కడా కాలేజీలో మాదిరి గ్రూపులే"

"అంటే..."

"పైకి అనరుగాని అందరూ వాళ్ళ వాళ్ళ కులాల ప్రకారం దగ్గరవుతుంటారు."

"ఛీ" అప్రయత్నంగా నా నోట్లో నుండి వచ్చింది. మస్తాన్ రెడ్డి పళ్ళన్నీ కనిపించేలా నవ్వాడు. అతని నవ్వే అంత. ఎలెక్ట్రిక్ బల్బు వెలిగినట్టుంటుంది.

"ఛీత్కరిస్తే ఎట్ల సార్. ఈ కాలమే అంత. ఏదో ఒక నెపంతో గ్రూపులేర్పరచుకోవాలి. కులం పేరుతో, జిల్లా పేరుతో.. రాజకీయాలే అంత. జీవితమూ అంతే. రాజకీయాలు లేని అంశమంటూ లేదు" అన్నాడు దృఢంగా.

"మేము విద్యార్థులుగా ఉన్నప్పుడు రాజకీయాలకు మమ్మల్ని దూరంగా ఉండమని హెచ్చరించే వారు మస్తాన్‌రెడ్డీ."

"మీరూ మమ్మల్ని అలాగే ఉండమనేవారు సార్. కానీ అప్పటికే శంకరరెడ్డి మాస్టారు, రాజు మాస్టారు, కిష్టప్ప సారు, మాధవరావు సారు మమ్మల్ని గ్రూపులుగా చేరదీస్తుండేవారు మీకు తెలుసో... తెలీదో..."

నాకు తెలీదన్నట్టు తల ఊపాను.

"రాజకీయాలతోనే నీకు గడచిపోతుందేమో! మరి సంసార భారం? అంతా భార్యమీదేనా?" అని అడిగాను నవ్వుతూ.

"అలా అని కాదు సార్. పనిని బట్టి సర్దుకుపోవాలి. నేను ఒక యన్‌జిఓ కూడా నడుపుతున్నాను. ఆ విషయమై కొన్ని ఫండ్స్ కోసం ఈ ఊరు వచ్చాను. చాలా మినిస్ట్రీలు యన్‌జిఓలకు డబ్బు కేటాయిస్తాయి కదా!"

అవునని తల ఊపాను.

"నాకు కావలసిన సమాచారం దొరికింది. ఇంకా ఒకరినిద్దరిని కలవాలి. నాకు ఫండ్స్ దొరుకుతాయని నమ్మకముంది. వెనకబడిన కులాల సంక్షేమం కోసం, వాళ్ళ పిల్లల కోసం అంటే ఎవరూ కాదనరు. అయితే మాది ఉత్తుత్తి సంఘం కాదులెండి. నిజంగానే పని జరుగుతోంది."

"మంచిదే కదా. అలాగే ఉండాలి. చేసే పని చిత్త శుద్ధితో చేయాలి. ఇంకేమిటి విశేషాలు?"

"విశేషాలేమిటి సార్. మీరింత దూరంగా ఉండి

## కుంచం

**నా** కలం చాలా గొప్పది
రోజంతా శ్రమించి
రాత్రంతా కలలు కంటోంది
'రేపు'ని చిత్రీకరించే
భావస్ఫూర్తితో..

-జి. శైలూషి

## కన్నులరమోడ్చి...

**న**లరాజు కరములో వాంఛితార్థమ్ములో
స్పర్శ సంతోషమిదె, విచ్చె తారకా పథము
సిగ్గు ఎరుపుల నిగ్గు రాగ సంధ్య
"జహాతిస్వయమంబర" మాత్మవివశ

సలలితైందవ కిరణ సంజాతపూత
విమల తరచారు చంద్రికావితతి తోడ
కూడి యొప్పారు రోదసీ కుహరసీమ
తెలివి హృదయంబు లోగొను దివ్వెలోతు

నింగి నీలిమాంతరంగమందు నిల్వకపారు
వెన్నెలవాగునంబడి వెడలుచున్నది
చిత్ర గతుల నొక్క పూల పడవ
చుక్కల తెరచాప తానెత్తి కొనుచు

చంద్రికలు వెదజల్లు పూర్ణిమా నిశలయందు
పవన వీచికలు పుప్పొడి రజము పూయ
విధుర ఏకాంత సైకత సీమలందు
మగువ మైదాల్చె మంచు మేలిముసుగు

పోహణించు ఊహల పోకముడి వీడ
తనువు ధనువైన తరుణీలలామ
అలక తడియార్చు అద్భుత భంగిమతో
కదలి కదలని కదలికల వదలుచుండె

సలిల తరంగిత మధుర సంగీతరవము
మంద మందముగ వీనుల విందుసేయ
యౌవన భారము మంజీర స్వరముజేసి
అడుగుపెట్టెను నవల పడవలోకి

పడతి కులుకును మోసి పడవ కదల
నడవలంబడి తోచె నాట్య సరణి
విరహగానము పవన వీచికల దేల
రెక్కలల్లార్చె రేయి వలపు పులుగు

ఆ మనోహర సాంద్రనీహారసీమలందు
హృదయ చిత్రిత సాకార వలయవర్తి
హర్ష విహ్వలత నెంతయు నతిశయించి
మరలదయ్యెను మనసు మనసునుండి

మునిపంటన ధరాధరమ్ము నొక్కి పట్టి
కన్నులరమోడ్చి కలికి వెన్నువిరిచె
చటుల విభ్రమగతి నొక్క త్రుటినియందె
గుండెలోపల మెత్తని ముల్లు గుచ్చె...

-సాంధ్యశ్రీ

పోయారు. మీ కలల ప్రపంచంలో మీరున్నారు ఇంకా దేశభక్తి గేయాలు వింటూ. ఇవన్నీ అవుట్ ఆఫ్ ఫ్యాషన్ సార్. "శాంతి సామరస్యాలు" "స్నేహ సౌహార్ద్రాలు" "సమైక్యత సౌభ్రాతృత్వం" అనే మాటలు ఇప్పుడు స్కూలు పాఠాల్లో కూడా కనిపించవు. ఏదో స్వాతంత్ర్య దినోత్సవం నాడు, లేదా గాంధీ పుట్టిన రోజు నాయకులు ఈ మాటలు వినిపిస్తుంటారు. మాలాంటి వాళ్ళం గుంపుల మధ్య ఉండి తప్పట్లు కొట్టిస్తుంటాం."

"మస్తాన్‌రెడ్డీ, నీ వయసెంత?" అని అడిగాను.

## పలకరిస్తున్న పరిశోధన

నిలయం యశస్సు కాదు
బతకడం దినచర్య కాదు
అయినా మానవత్వం రెంటిలోనూ ప్రత్యక్షం
చంద్రుడంటే వునికి కాదు
చీకటి నీడల వెనుక వెన్నెల కాదు
అంతరంగంలో అంతర్గపు ఆంతర్యం
ఈ నిమిషంలో
కనుచూపుమేరలో
కదిలివచ్చే నీలిమబ్బుల జాడలేదు
కళ్ళెదురుగా ఒకరోజు
గులాబిలా ఎదురైనా
అరవిరిసిన అందం కానరాదు
ఆలోచిస్తూ
పసిమొగ్గల్ని చేతితో స్పృశిస్తూ
వర్తమానాన్ని వల్లెవేస్తూ
దానవత్వాన్ని వీక్షిస్తూ
కదులుతున్న మానవాకృతి
అసాధారణ వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తోంది
మనసు మౌనంగా వుంది
విశ్వాసం విశ్రాంతిలో వుంది
సృష్టి అన్వేషణలో వుంది
నా ప్రశ్న, సమాధానం రెండూ ఒకటిగా వుంది.
ప్రపంచం పంజరాన్ని దాటి స్వేచ్ఛగా విహరిస్తోంది
ఆకాశంలో నక్షత్రాల పలకరింపు బావుంది
కారణం ఏదైనా
త్యాగం తెలిసిన మేఘం కోరకుండానే
కన్నీళ్ళు తుడుస్తుంది.
కాంతినివ్వడం మాత్రం తెలిసిన దీపం
ఎదురుగా ఎవరున్నా వెలుగుతుంది.
ప్రవహించడంలో ఆనందం చూపుతున్న నీరు
నేలపై వున్న మట్టికణాలను కూడా తీసుకెళ్తుంది.
దూరంగా వుండటమే తెలిసిన అనురాగం
మనసును సుదూర తీరాల్లోకి పయనింపజేస్తుంది.
అందనంత ఎత్తులో వుండే ఆలోచన
ఎవరూ అందుకోలేనంతగా ఎదిగిపోతుంది
ఇష్టం వున్నా లేకున్నా ప్రతిసారి
వాస్తవాల్ని భరించాల్సి వస్తుంది.
ఆవేశం హక్కులకై పోరాడమంటుంది.
మిగిలిన శరీరం అస్థిపంజరమై
ముందు తరాలకు పరిశోధనకై ఉపకరిస్తుంది.

**–శైలజామిత్ర**

"నలభై ఏడు సార్."

"నా వయసెంత?"

"తెలీదు సార్. మా కంటె ఆరేడేండ్లు ఎక్కువగా ఉండొచ్చు."

"ఇంత మాత్రానికే మన ప్రపంచాలు ఇంతగా విడిపోవాలా?"

"చెప్పాను కద సార్. మీరు స్వతంత్రం వచ్చిన కొత్తలో, ఆ ఉత్సాహంలో చదువుకొన్నారు. మేము చదువు కొనేసరికి పాత వాసనలు వదల్లేదు గాని మరెన్నో కొత్త విషయాలు చోటు చేసుకొన్నాయి. మేమా గ్రౌండ్ లెవల్లో రాజకీయాలు నడిపిస్తున్నాము. అవి రోజురోజుకు ఎంత క్లిష్టమవుతున్నాయో చెప్పలేము. మాకున్నంత అవగాహన మీకు రావాలంటే కష్టం. క్షమించాలి ఈ మాట అహం కారంతో అనలేదు. ఉన్నమాటే."

నాకు అర్థమవుతోందన్నట్టు తల ఊపాను. మస్తాన్‌రెడ్డి చెప్పుకుపోతున్నాడు. "మనం నాయకులు కావాలనుకొంటే, పలుకుబడి కావాలంటే మన మాట పదిమందీ వినాలి. దానికి భావోద్రేకాలు రెచ్చగొట్టాలి. ప్రజల హృదయానికి దగ్గరగా ఉన్న విషయాన్ని తాకాలి. అనుకొన్నవన్నీ సాధిస్తామని కాదు. కానీ వాళ్ళకా ఆశ కల్పించాలి. నిత్యమూ ఏదో ఒక లక్ష్యం వెలుస్తూ ఉండాలి. దేనికోసమో వెర్రిగా పరుగులు పెడుతూనే ఉండాలి."

"ఎందుకంత అసంతృప్తి?" అని అడిగాను.

"అసంతృప్తి లేనిదెక్కడ? దేశం మొత్తం సర్వే చేసి చూడండి. ఎవరు సంతోషంగా, తృప్తిగా ఉన్నారో చెప్పండి. అంతెందుకు. ఇంతగా పెరిగిపోతున్న వ్యాపారం మాత్రం మన అసంతృప్తిని పెట్టుబడిగా చేసుకోటం లేదా? ఇది కొంటే సుఖం, అది కొంటే లాభం అని ప్రలోభపెట్టటంలేదా?"

నేను మెల్లగా తల ఊపాను.

"రాజకీయాలూ అంతే. కులం కానివ్వండి, మతం కానివ్వండి, ప్రాంతం కానివ్వండి రాజకీయాలు ఉండాల్సిందే. ప్రజలను ఆకట్టుకోవాలంటే "అదిగో తోక" అనాల్సిందే. అంతే. ఇక వేట ప్రారంభమైపోతుంది" మస్తాన్‌రెడ్డి నవ్వాడు.

అతని మాటలు వింటుంటే ఏదో మబ్బు తెర తొలగినట్లే ఉంది. లేక కమ్ముకొంటోందా?

"సరేలే ఇప్పుడు ఏ తోకను చూపిస్తున్నావేమిటి?" అని అడిగాను.

"ఇప్పుడు మా ఊరును హెడ్ క్వార్టర్సుగా చేసి చుట్టుపక్కల చిన్న ఊర్లు కలిపి ప్రత్యేకమైన జిల్లా ఏర్పాటు చేయమని ఆందోళన ప్రారంభిస్తున్నాము."

"ఆందోళనెందుకూ? ప్రజాస్వామ్యంలో ఒక పద్ధతి, తీరూ లేదా? అన్నిటికీ వీధిన పడాల్సిందేనా? కారణాలు చూపిస్తూ అర్జీలు పెట్టుకోలేరా? మీ లోకల్ పంచాయతీలు, మునిసిపాలిటీలు, యం.ఎల్.ఏ.లు ఏమయ్యారు? అసెంబ్లీలో వీళ్ళంతా ఏం చేస్తుంటారు?"

"అటువంటి ఆశలు మాకు లేవు సార్. ఎవరి మాటలు ఎవరు వింటారు? వీధులెక్కాల్సిందే. అందరి గొంతులు మించి మన గొంతు గట్టిగా వినిపించాలి. అప్పుడే ప్రభువుల చెవిన పడేది."

"ఇప్పుడు మీ ఊరు జిల్లాకాకపోతే నష్టమేమిటి?"

"అయ్యో అలా అనకండి సార్. మా ఊరు చూశారు కదా. ఎంత చక్కటి ఊరు! స్వాతంత్ర్యోద్యమంలో, ఆ తర్వాత ఎంత గొప్ప పాత్ర వహించింది! ఎంత గొప్ప నాయకులు మా కాలేజిలో చదువుకొన్నారు! అందుకే దానికి గుర్తింపు కావాలి. పర్యాటక స్థలంగా అభివృద్ధి చెందాలి. సాగుబడి నీరు, తాగటానికి నీళ్ళు ఏర్పాటు చేయాలి. మాకు చిన్న నది బాహుదా ఉండేది సార్. ఎప్పుడూ నీళ్ళుండేవి. అదెక్కడో ప్రాజెక్టు కటి నీళ్ళు మళ్లించేశారు సార్. రైతుల అగచాట్లు చెప్పే దానికి కాదు. అందుకే మా సమస్యలు తీరటానికి మాకు వేరే జిల్లా కావాలి."

"నీవు చెప్పిన విషయాలు అన్ని ప్రాంతాలకూ వర్తిస్తాయి. చిన్న చిన్న జిల్లాలయినంత మాత్రాన బాగా అభివృద్ధి చెందాయన్న దాఖలాలేవీ లేవు. ఉన్న నిధులు, వనరులు పెరగవు కదా. తప్పితే మీలాంటి నాయకులకు మరికొని పదవులు. పరిపాలనకు మరికొన్ని ఉద్యోగాలు దీనివల్ల ఇంకా ప్రజలకు నష్టమే."

"మీరేమైనా అనండి సార్ ఇది మా ప్రతిష్ఠకు సంబంధించింది. మా ఆత్మ గౌరవానికి సంబంధించింది. మాకెంత చరిత్ర ఉంది! ఈ మాత్రం గుర్తింపు అవసరమా కాదా?"

"నిజమేనయ్యా. మనందరికీ గొప్ప చరిత్ర ఉంది. గొప్ప సంస్కృతి ఉంది. అందరూ కలిస్తేనే కదా గొప్పతనం రాణించేది. ఆసియాలో చైనాకు, భారతదేశానికి ఇంత గొప్ప గుర్తింపు ఉందంటే ఎందుకు? మనం పెద్ద దేశాలు కాబట్టి. ప్రపంచ దేశాలే దగ్గరవుతున్నాయి. సమాఖ్య లేర్పడుతున్నాయి. దలైలామా సంగతే చూడు. ప్రత్యేకమైన టిబెట్టు కోసం తన జీవితాన్నే అంకితం చేసుకొన్నాడు. అదే తన ధ్యేయమన్నాడు. ఇప్పుడు తమ సంస్కృతిని నిలుపుకొంటూ చైనాలో భాగంగా ఉండటానికి అభ్యంతరం లేదంటున్నాడు. ప్రపంచం తీరే ఇలా ఉంటే నీవేమో ముక్క చెక్కలుగా ఆలోచిస్తున్నావు."

మస్తాన్‌రెడ్డి మళ్ళీ నవ్వాడు. "అందరూ తమకు తోచినట్లు మాట్లాడుతారు. తమకు లాభదాయకమైనదాన్నే ప్రశంసిస్తారు. మీరు ప్రపంచ స్థాయిలో మాట్లాడుతున్నది కూడా ఒక మిథ్యే. యుద్ధాలు వద్దు వద్దంటూనే ఎన్ని యుద్ధాలు జరుగుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. ఏ ఉరవడినీ ఎవరూ ఆపలేరు. అంతమాత్రంతో ఎవరూ మాట్లాడవద్దని కాదు. ఒకే అభిప్రాయం ఉండాలనీ కాదు. అందరూ మాట్లాడవలసిందే. అందరూ పోరాడవలసిందే. అందరూ తమ లక్ష్యాలు చేరుకోవలసిందే. అదే కద సార్ ప్రజాస్వామ్యమంటే. మీరు భిన్నత్వంలో ఏకత్వమంటారు మేము ఏకత్వంలో భిన్నత్వమంటాం. ఇదే ఈనాటి ఫిలాసఫీ."

"ఎంత గొప్పగా వివరించావయ్యా మస్తాన్‌రెడ్డీ, నిజంగానే నువ్వు నా గురువువయ్యా" అన్నాను.

"అలా అనకండి సార్. పాఠాలు చెప్పిన గురువులు మీరు. వాక్య నిర్మాణం, వ్యాకరణం మీ దగ్గర నేర్చుకొన్నదే. భావ వ్యక్తీకరణ మాత్రం నాది. వస్తాను సార్. మళ్ళీ కలుద్దాం" అంటూ లేచాడు మస్తాన్‌రెడ్డి.

అప్పుడే లైటు వచ్చింది. "ఉదయమ్మాయెను, స్వేచ్ఛా భారతముదయమ్మాయెనుహో..." సూర్యకుమారి గొంతు.

"ఇదేం బోరు సార్. కొత్త పాటలు వినండి సార్. ఈసారి వచ్చినప్పుడు కొత్త కాసెట్లు తెస్తాను" అని సెలవు తీసుకొన్నాడు మస్తాన్‌రెడ్డి.

■